# 25. ఇంటి దొంగ

చూడగానే విశ్వాన్ని గుర్తించలేకపొయ్యాను. ఒకప్పుడు మే మిద్దరమూ ప్రాణమిత్రులమే అయినా కాలేజీనుంచి బైటపడ్డాక ఇద్దరిదీ చెరోదారీ అయింది. ఇద్దరమూ ఎంతో దూరదూరంగా జీవితాల్ని గడపసాగాం. ఇద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరగలేదు. విశ్వమనే ప్రాణ మిత్రుడొకడు నా కొకనాడు ఉండేవాడన్న సంగతి కూడా మరిచిపొయ్యాను. చిరకాలవియోగం ప్రసాదించే మరుపుకూ ఇతర బంధు మిత్రులతో జీవితం అలవాటు పడటమూ కారణాలై ఉంటవి.

విశ్వం మాత్రం నన్ను గుర్తుపట్టాడు. నేను మారకుండా ఉండకపోయినా – విశ్వం మారినంతగా మారి ఉండ ననుకుంటాను. విశ్వం నన్ను పలకరించి నప్పుడు ఆ యీ వ్యక్తితో నాకు చాలా పరిచయం ఉండే దన్న జ్ఞానం మాత్రమే కలిగింది కాని, ఆ వ్యక్తి ఎవరో చప్పున గుర్తించలేకపొయ్యాను. పుష్కరన్నర దాటాక హఠాత్తుగా అనుకోకుండా వాణ్ని చూడటం వల్ల ఉన్న జ్ఞాపక శక్తి కూడా వెంటనే పనిచేసి ఉండదు.

వాణ్ని గుర్తించగానే నాకు బ్రహ్మానందమైంది. కాలేజీ జీవితమంతా కళ్ళముందు తిరిగింది. ఆ ఆనందమంతా ఎప్పటికీ తిరిగిరాదు. కాని దాని తాలూకు జ్ఞాపకాలు ఇచ్చే విచిత్రానుభూతిని అనుభవించ గలిగాను. వయస్సు పెరిగినా, చిన్ననాటి అనుభవాల్ని జ్ఞాపకం చేసుకునేందు కేమీ ఆటంకం లేకపోయింది.

వాడి బలవంతం మీద ఆ రాత్రి వాడితోనే గడిపేందుకు ఒప్పుకున్నాను. వాడి పరిస్థితి చూస్తే నాకు యీర్ష్య కలిగిస్తుంది. నాలాగు వాడు ఒకరికింద నౌకరికి లేడు. స్వతంత్రంగా వ్యాపారం చేసి బాగా సంపాయించినట్టున్నాడు. స్వంత డాబాఇల్లు, నౌకర్లూ, ఇంటిలోని ఫర్నిచరూ మొదలైనవి చూస్తే మంచి రకం జీవితాన్ని గడుపుతున్నాడని గ్రహించాను. ఇంతకూ వాడు అదృష్టవంతుడు!

నా స్వంత ఇంట్లో నాకు జరగనంత మర్యాద జరిగింది. ఆనాటి స్నేహం యీ నాటివరకూ సాగినట్టయితే అది ఏ రూపం దాల్చేదో దాన్నే చూడగలుగుతున్నాననిపించింది. విశ్వం ఐశ్వర్యాన్ని చూశాక నిజంగా నేను సిగ్గు పడాల్సి వొచ్చింది. కాని మిత్రరూపంలో వాణ్ని చూసేందుకు అలవాటు పడ్డాక నా గాబరా బాగా తగ్గిపోయింది.

భోజనం చేసి రాత్రి వెన్నెల్లో కూర్చున్నాం. అనేక విషయాలు - నేను మరిచిపోయినవికూడా విశ్వం జ్ఞాపకం చేస్తున్నాడు. పడకకుర్చీలో పడుకొని కళ్ళు మూసుకొని వాడి మాటలకు దృశ్యరూపాన్ని ఇస్తూ ఆనందించసాగాను. నా అంత మరుపు విశ్వానికి లేదనుకుంటాను. లేక నా మీద వాడికి వున్న సదభిప్రాయంతో జరిగిపోయిన అనేక సంఘటనలను అప్పుడప్పుడు జ్ఞాపకం చేసుకుంటూండేవాడు కాబోలు. జీవితంలో అనుభవించనంత ఆనందాన్ని ఆ రాత్రి చవి చూశాను.

చిన్ననాటి విషయాల మీదినుంచి సంభాషణ ప్రస్తుతం జీవితంమీదికి జరిగింది. జీవితం నాకెంత బాధాకరంగా వుందో -విశ్వానికి అంత ఆనందదాయకంగా వుందని గ్రహించాను - వాడే ఆ మాట అన్నప్పుడు పూర్వం గ్రహించిన దాన్ని గాఢంగా నమ్మాననడం సమంజస మనుకుంటాను.

"అంతా బాగానేవుంది. అబ్బాయిదే నాకు దిగులు" అన్నాడు విశ్వం.

"ఏం?" అన్నాను.

"ప్రస్తుతం వాడు స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు-"

"ఇంకేం! త్వరలోనే సీమకు ఎగుమతి చేస్తావన్న మాట."

"చేయలేనని కాదు, ఆ తెలివితేటలు వాడి దగ్గర లేవని కాదు."

"మరి?"

"వాడి బుద్ధి అంత మంచిదిగా కనిపించదు. ఒక్కగాను ఒక్కడని చిన్నతనంనుంచీ అల్లారుముద్దుగా పెంచుతూ వొచ్చాం. వాడు చేసే పొరపాట్లను అంతగా గమనించలేదు. గమనించినా దానికి తగిన శిక్షను విధించకుండా ఊరుకున్నాం. పెద్దవాడయాకన్నా వాడి బుద్ధి మారుతుందని ఆశ పెట్టుకున్నాం కాని - మొక్కయి వంగనిది మానై వొంగుతుందా?"

"నాకు అర్థం కాలేదు. కుర్రాణ్ని చూస్తే అంతగా చెడిపోయిన లక్షణాలేమీ నాకు కనిపించటంలేదు."

"చెడుసహవాసాలవల్ల చెడ్డాడేమో ననుకుంటాను-"

"ఆ చెడటాన్నే విడమరిచి-"

"వొస్తున్నాను. చిన్నతనంలో నన్ను కానీ తల్లిని కానీ అడుగుతే ఇస్తామో లేదోనని అడపాదడపా జేబులు సవరిస్తూండేవాడు. చాలా రోజుల వరకూ మే మిది కనుక్కోలేకపొయ్యాం. రాగినాణాలతో మొదలైన యీ దొంగతనం వెండి నాణాలవరకూ పోయినప్పుడు కాని మాకు తెలియ లేదు. అప్పటికీ మాటలతో బెదిరించి ఊరుకునేవాళ్ళం. వాడి ముద్దుతనం వాణ్నొక మొద్దుగా తయారు చేసేందుకు సహాయపడ్డది. మా బెదిరింపులు ఒక విధంగా వాడి పనికి ప్రోత్సాహ మిచ్చిన వనే చెప్పాలి. ఏ వ్యసనాని కయినా అలవాటు పడ్డవాడు దాన్ని వొదిలించుకోవటం మాటలకొస్తే - తగిలించుకోవటమంత తేలిక మాత్రం కాదు. కనీసం దానివల్ల కలిగే చెరుపును గుర్చి ఆలోచించకపోవటంవల్ల దాన్ని వొదిలించుకోవాలనే జ్ఞానం కూడా ఉండదు. తను దోషినని నమ్మని దుర్మార్గుడికి పశ్చాత్తాపం ఉండాల్సిన అవసరం ఏముందీ?"

"ఏదో చిన్నతనం కదూ?" అన్నాను. దొంగతనాన్ని సమర్థిద్దామని కాదు కాని, ఒక విధంగా స్నేహితుడికి ఓదార్పు కలిగిద్దామని.

"ఇంకా ఏం చిన్నతనం? రేపు మార్చ్‌కి మేజర్ అవుతాడు. డబ్బు అవసర మనేది వాడి యీడు పిల్లలకు ఉండదని కాదు కాని - ఆ కావాల్సిన డబ్బేదో నన్న డక్కూడదూ? ఇంకేమైనా ఇతర దురభ్యాసాలున్నయ్యేమో నని చూశాను కాని అలాటి వేమీ ఉన్న సూచనలు ఎప్పుడూ కనిపించలేదు-"

"మరి డబ్బు అవసరం ఉంటే దొంగతనంగా తీసుకు వెళ్ళాల్సిన అవసరం ఏముందీ? ఆ డబ్బు ఖర్చయేమార్గం వక్రమైంది ఐ ఉండాలని నా సందేహం" అన్నాను.

"నాకూ యీ అనుమానం రాకపోలేదు. వాడికి స్నేహితులు ఎక్కువ. వాళ్ళ ఖర్చులు కూడా అనవసరంగా తనే భరించేందుకు ప్రయత్నిస్తూంటాడు. అది స్నేహాన్ని పెంపొందించుకునే మార్గమన్నా కావాలి, లేక తను ఉన్నత కుటుంబంలోని వ్యక్తనే విషయాల్ని చాటటానికన్నా కావాలి. ఒకసారి ఆ పని చేశాక - మళ్ళీ ఎన్నిసార్లయినా చేయవలసిన అవసరం వుంటుంది. ఎందుకంటే ఖర్చును భరించేవాడు దొరకాలే కాని - వాడి గుణగుణాల్ని పొగుడుతూ వాణ్ని సక్రమమార్గాన ఉపయోగించుకునే జనం తక్కువలేరుగా! మొదట్లో చూపిన డాబుదర్జాల్ని కాపాడుకునే నిమిత్తమే వాడుకూడా దారితప్పి నడిచే అవకాశం లేకుండా చేసుకున్నా డనుకుంటాను."

"ఇది నిజమైనా కావొచ్చు. స్నేహం అనేది అడ్డం ఉన్నప్పుడు స్నేహితులకు ఖర్చు పెట్టటమనేది పెద్దప్రశ్న కాదు. దానికైనా నిన్ను అడిగి తీసుకోవొచ్చుగా!"

"నిజమే. నాతో ఇవన్నీ చెప్తే నేను ఎగతాళిగా నవ్వుతాననీ, తన నసలు నమ్మననీ వాడి అనుమానం. కనీసం ఆ అనుమానాన్ని తీర్చుకునేందుకు వాడు అడిగినా - ఉన్నది కదా నని ధారావాహికంగా ఇవ్వటం మాత్రం ఏమంత మంచిపని! మాటవరసకైనా 'ఎందుకు' అని అడగవలసి వుంటుంది. అలా నేను అడగటాన్ని వాడు భరించలేడు. తన ఖర్చుకు తగిన కారణాన్ని - నేను తేలిగ్గా నమ్మే కారణాన్ని నాకు తృప్తికరంగా ఉండేట్టు చెప్పలేడు. అదంతా అలా వుంచి - ఒకరకం వ్యసనానికి అలవాటుపడివున్న వాడు కనుకా, తేలిగ్గా ఒకరికి జవాబు చెప్పక్కర్లేకుండానే డబ్బు వొచ్చే మార్గంవుంది కనుకా దాన్నే అనుసరిస్తూ వొచ్చాడు..."

"పోనీ ఒక పనిచెయ్యలేక పొయ్యావా?"

"ఏమిటది?" అన్నాడు విశ్వం.

"వాడికి డబ్బు అందకుండా ఉంచలేక పొయ్యావా?"

"అదీ చేసిచూశాను. కాని వాడి తెలివి తేటలేమో కాని, పెట్టెలకు ఎన్ని తాళాలు మార్చినా - వాడిదగ్గర మరుక్షణానికే డూప్లికేట్ తాళం చెవి తయారుగా వుంటుంది-"

"ఇంట్లో డబ్బు ఉంచవోక."

"చివరకు ఆ పనే చేశాను. కొద్దో గొప్పో ఉంచి మిగతాది బాంకులో వేశాను. ఆ కొద్దో గొప్పలోనే వాడి చెయ్యి పడుతూ వుంటుంది."

"మిగతా జాగ్రత్తలు కూడా తీసుకోక పొయ్యావా?"

"ఎన్ని చేస్తే ఏం లాభం? ఇంటిదొంగను యీశ్వరుడు కూడా పట్టలేడు. వాడి మార్గాన్ని మరీ కష్టభూయిష్ఠం చేస్తే - ఇంట్లోని వెండిసామాగ్రిమీద దృష్టి పడుతుందేమో నని ఇంకో భయం. కరెన్సీ నోట్లయితే ఎవరూ అనుమానించరు కాని - ఇంట్లోని విలువైన సామాగ్రి బజారున పడితే ఇక మన పరువు మర్యాదలు ఏమవుతయ్యో చెప్పక్కర్లేదు. అందుకనే చేసే దేమీ లేక ఇదంతా భరించి ఊరుకోవాల్సిన అవసరం ఏర్పడ్డది."

విశ్వం చెప్పిన దాంట్లో నిజం లేకపోలేదు. ఇలాటి పుత్రుడు ఉండాలి కాని - ఇక ఆ తండ్రి అవస్థ చెప్పాలా అనిపించింది.

"ఒకందుకు మాత్రం సంతోషిస్తాను-" అన్నాడు విశ్వం.

"ఏమిటది?"

"వాడు చేసే దొంగతనం వాడి ఇంట్లోనే కనుక సరిపోయింది. బైట పరాయి సొత్తుమాత్రం వాడు ఎరుగడు. అదేకనుక వుంటే నేనిప్పటికి ఎన్నిసార్లు కోర్టుకు యీడ్చబడేవాణ్నో!"

ఇదీకొంత నయమే! గుడ్డిలో కాస్తమెల్ల! కుటుంబ రహస్యం కిందనే ఉండి పోయింది కనుక సరిపోయింది.

విశ్వం జీవితానికి ఇదొక్కటే లోటుగా కనిపిస్తోంది. ఏమైనా వాడి కొడుకుది ఇంకా విద్యార్థి దశే కనుక - ముందు ముందు తన యీ దౌర్బల్యాన్ని తెలుసుకో గలుగుతాడనే ఆశ నాకు వుంది. నాకేకాదు - ఆ మాట అన్నప్పుడు తనకూ కొద్ది ఆశ వుందని విశ్వం చెప్పాడు.

అర్థరాత్రి కూడా దాటటంవల్ల నిద్రాదేవిని ఆరాధించే నిమిత్తం నేను నా గదిలో ప్రవేశించాను.

## 2

పడుకున్నా నన్న మాటేకాని నిద్దర పట్టటం లేదు. అది కొత్త ప్రదేశమని లేదనుకుంటాను. అనేక ఆలోచనలు నా మనశ్శాంతిని భగ్నం చేయ సాగినయ్.

విశ్వం కొడుకు సంగతి నన్ను మరీ కలవర పెట్టింది. అలాటి వాళ్ళు లోకంలో బహుకొద్ది అని అనను కాని - విశ్వానికే ఇలాటివాడు ఉన్నాడని విచారపడ్డాను..

చప్పున ఇంకో విషయం జ్ఞాపకం వొచ్చింది. యీ ఉదయానే ఐదువేల రూపాయిలు కంపెనీ సొమ్ము వసూలు చేశాను. ఆ పెద్ద మొత్తం నా జేబులోనే వుంది. యీ ఇంటిలోనే ఒక దొంగ ఉన్నాడని విశ్వం చెప్పనే చెప్పాడు. ఇది కాస్తా వాడి చేతికి చిక్కిందంటే ఇక నాపని వేరే చెప్పక్కర్లేదు. నాకు ఉద్యోగం పోవటమే కాకుండా - గోదావరి స్నానంకూడా తప్పదు.

విశ్వాన్ని పిలిచి యీ సొమ్ము వాడిచేతికే ఇస్తే సరిపోతుందనే ఆలోచన వెంటనే కలిగింది. కాని ఇప్పటికే ఒకటిన్నర దాటింది కనుక - వాడు ఎక్కడో గాఢనిద్రలో ఉంటాడు. వాణ్ని యీ సమయంలో నిద్రలేపటం నాకు ఇష్టం లేదు. అదీకాక, యీ సొమ్మును దాయమని వాడికి ఇస్తే తన కొడుకును నేను కూడా ఒక దొంగ కింద (నిజానికి నా డబ్బే మీ వాడు అపహరించకపోయినా) జమ కట్టానని వాడు కష్టపడతాడేమో? తన కొడుకును తాను ఎన్ని అన్నా కష్టం వుండదు కాని, పరాయిమనిషినైన నేను ఏమన్నా వాడు కష్టపడ వొచ్చు. విశ్వం చెప్పినట్టు వాడికొడుకు తన తండ్రి ఆస్తిని దొంగిలించేందుకు అలవాటు పడ్డాడు కాని - ఇతరుల సొత్తు జోలికి పోడనీ, అదే కాస్త మేలనీ గుర్తొచ్చింది. యీ షరావల్ల నాకు కాస్త స్థిమితం చిక్కింది.

అసలు నా దగ్గర ఇంత పెద్ద మొత్తం ఉన్నట్టు వాడికి తెలుస్తే కద - నాజేబు తడవాల్సిన అవసరం ఏర్పడేది! యీ ఒక్కరాత్రీ ఏదోవిధంగా, గడిపానంటే తెల్లారితే నిశ్చితంగా రైలు ఎక్కవొచ్చు. విశ్వం కొడుకు ఎలాటి వాడైనా, వాణ్ని గూర్చి విశ్వం నాతో ఏమీ చెప్పకపోయినట్టయితే - కనీసం వాణ్నొక దొంగగా నాకు చిత్రించకుండా ఉన్నట్టయితే నాకీ బాధ కలిగేదికాదు. ఏదెలా వున్నా ఆ నాలుగైదు గంటలూ గడిపి తీరవలసిన అవసరం వొకటి ఉండనే వుంది..బాగా అలిసివున్న నాకు అనుకున్న దానికన్న త్వరలోనే నిద్రపట్టింది.

## 3

అనుమానించినంత పనీ ఐంది. ఉదయం ప్రయాణ సన్నాహం పూర్తయే సమయానికి పర్స్ కాస్తా మాయమైందన్న సంగతి తెలుసుకో గలిగాను.

డబ్బుమాట ఎలావున్నా యీ విషయం విశ్వంతో చెప్పేట్టా మానేట్టా అనే సమస్య నన్ను వేధించింది. నిజానికి నా దగ్గర అంత పెద్దమొత్తం వున్నదనే సంగతి నేను విశ్వానికి చెప్పలేదు. చెప్పనంత మాత్రంచేత వాడు నన్ను నమ్మలేదనికాదుకాని, మొత్తం పెద్దది కావటంవల్ల దాన్ని రుజూ చేసుకోవలసిన బాధ్యత నాకువుంది-కనీసం ఎదుటి వ్యక్తికి తృప్తికరంగా ఉండేట్టు చేసేందుకన్నా! ఆ క్రితంరోజు నేను ఐదువేల రూపాయలకూ కంపెనీ తరఫున రసీదు ఇవ్వటం ఒక సాక్ష్యమేకాని ఆ ఆర్గ్యుమెంట్ కూడా నిలవదు. ఎందుకంటే - నేను పైకం పుచ్చుకున్న మాట నిజమేకాని - నేను నిద్రపొయ్యే సమయానికి ఆ పైకం నా దగ్గరే వుందనీ ఉదయానికి మాయమైందనీ ఎలా రుజూ చెయ్యగలను?

ఇదే ఏ హొటల్లోనో జరిగివుంటే యీపాటికి పోలీస్ రిపోర్టు కూడా ఇచ్చి ఉండేవాణ్ణి, పోయినసొమ్ము దొరికినా దొరక్కపోయినా ఒక విధమైన తృప్తికోసం ఆపని చేసేవాణ్ణి, కాని ఇది ముఖ్య మిత్రుడి గృహం. నాకెంతో మర్యాద జరిగిన తావు. యీ విషయాన్ని బైట పెట్టటమంటే నా మిత్రుడి పరువు మర్యాదల్ని బజారు పాలుచెయ్యటమే!

అసలు సమస్య డబ్బు! డబ్బు దగ్గర స్నేహాలూ, బంధుత్వాలూ, మానవత్వాలూ ఏ రూపాన్నయినా ఏ అవతారాన్నయినా ధరించవొచ్చు. మన ఊహ ఆ రంగును ఊహించలేదేమో? దాని పర్యవసానానికి నేను భయపడవలసి వుంటుంది. ఎదుటివ్యక్తి పరువు మర్యాదల్ని నేను ప్రశ్నించవలసిన సంఘటనలో నా పరువు మర్యాదలుకూడా ప్రశ్న రూపమే దాల్చుతవి. నేను గుమాస్తా గిరితో పొట్టపోసుకునేవాణ్ణి. కనుక డబ్బుకు ఆశించి యీ నిందను ఇతరుల మీద వేసేందుకు ప్రయత్నిస్తున్నానని ఎవరు అన్నా చెల్లుతుంది. యీ మొత్తం తనకొక లెక్కలోది కాదని విశ్వం తేలిగ్గా రుజూ చేసుకోగలడు

– ఆ సమయంలో నేను డబ్బుపోగొట్టుకున్న దుఃఖానికి తోడు – అన్యాయంగా ఒక పెద్దమనిషిని – ఆప్తమిత్రుణ్ని పరాభవించానన్న లోకుల అభిప్రాయం నాకు కలిగించే బాధకు కూడా గురి కావలసి వుంటుంది.

పోనీ విశ్వం కొడుకు సంగతి జగద్విఖ్యాతమైనా నాకు కొంత అండవుండేది. అది ఒక కుటుంబ రహస్యం. దాన్ని కాపాడేందుకు కుటుంబమంతా ఎంతైనా సాహసించటం ధర్మం. మంచి భవిష్యత్ వున్న ఒక కుర్రవాడి జీవితానికి దెబ్బ తగులుతుంది. ఇంతా ఏడుస్తే న్యాయం, నిజం, ధర్మం నా వైపువున్నా – ప్రజలు నమ్మేవిధంగా నా పరిస్థితిని చెప్పలేను. ఎటొచ్చీ ఇంకాముందుకు సాగటంవల్ల మేలేమీలేదు సరికదా కీడే సూచింపబడుతోంది.

జీవితంలో కష్టాలకు అలవాటుపడ్డాను. అందుకని ఆ మనస్థయిర్యంతోనే దీన్ని ఎదుర్కొనేందుకే నిశ్చయించుకున్నాను.

తరువాత ఏమన్నా కానీ – నేను పడే బాధను నా మిత్రుడికి తెలియకుండా ఉండే ప్రయత్నాలు ఎన్నో చేశాను. విశాల హృదయంతో ఒకమిత్రుడి పరువు మర్యాదల్ని కాపాడిన ఉదార బుద్ధిని యీలోకం నమ్మినా నమ్మకపోయినా, మెచ్చినా, మెచ్చకున్నా – నా ఆత్మకు తృప్తివుంది. అన్నీ తెలిసిన ఆ విధికి నామీద జాలికలిగినా కలగవొచ్చు.

పర్స్ మొత్తం పోవటంవల్ల రైలుచార్జీలకుకూడా డబ్బు లేదు. కొత్త ప్రదేశంలో ఇంత ఇరుకున పడతాననుకోలేదు. ఏం చెయ్యటానికీ తోచకుండా వుంది.

విశ్వం నాలుగైదుసార్లు “అట్లా ఉన్నావేం? ఒంట్లో బాగుండలేదా?” అనే ప్రశ్నల్ని వివిధరూపాల్లో వొదిలాడు కాని, మనస్సును నిలవతొక్కుకోగలిగిన నేను వాడికేమీ సందివ్వలేదు.

వాడే స్టేషన్ దాకా వొచ్చి – టిక్కెట్ కొని ఇచ్చాడు. వాడు కొనేప్పుడు నేనేమీ ఆటంక పరచలేదు – అంతకన్న నేను నావూరు జేరే మార్గం ఇంకోటి లేదు కనుక!

రైలు కదిలాక కిటికీలోనుంచి జరిగిపోతూన్న దృశ్యాల్ని చూస్తూ నా యీ క్లిష్ట పరిస్థితినిగూర్చి ఆలోచించసాగాను.

కంపెనీ వాళ్ళకు ఏం జవాబు చెప్పేట్టు? నిజం చెప్తే నమ్ముతారనే ఆశలేదు. అందుకని అబద్ధంచెప్పి తప్పించుకునే సూచనా కనిపించటంలేదు. ఇంత పెద్ద మొత్తాన్ని నాలాటి సామాన్యుడు భరించనూలేడు. యీ సంఘటనతో నా జీవితమే నాశనమైందనుకున్నాను. యీ బాధ, అపకీర్తి కన్న ఆత్మహత్య మేలనిపించింది... అందుకూ ఒక విధంగా ప్రాణం వొప్పటంలేదు. ఇదివరకు ఏవో కొద్ది ఆశల్తో బతికేవాణ్ణి. ఇక ముందు నిరాశతోనే బతికేందుకు ప్రయత్నించాలి. జీవితంలో ఒక్క సంఘటన ఇంత గొప్ప మార్పును తేగలదనే విషయాన్ని మొట్టమొదటిసారి తెలుసుకున్నాను.

## 4

వాస్తవమంతా చెప్పాను. మేనేజర్ నమ్మలేదు. చెపుతూన్నంతసేపూ నవ్వుతూ కూర్చున్నాడు. ఒకరి బాధ ఇంకొకరికి ఏ చలనాన్నీ కలిగించలేక పోతుందనుకోలేదు.

అంతా విని అన్నాడు: "నువ్వు చెప్పింది నిజమో అబద్ధమో నాకు తెలియదు. తెలుసుకునేందుకు ప్రయత్నించటంవల్ల నీకు కలిగే మేలు కూడా ఏమీ ఉండదు. కంపెనీ ఐదువేల రూపాయిలూ నీవు కట్టవలసిందే. దానికి ఏం చెప్తావ్?"

"నేను కట్టక్కర్లేదని అనను, కాని..."

"ఇందు లోకానికి స్థానంలేదు. యీ పైకాన్ని కంపెనీ పెట్టుకోదు-"

"నాకు కొంచెం టైం ఇప్పిస్తే-"

"వీల్లేదు. నీవు వెంటనే పైకం చెల్లించవలసివుంది. లేకుంటే పోలీస్ రిపోర్ట్ ఇవ్వవలసి వుంటుంది. యీ బాధ్యతను మాత్రం నేను నెత్తిన వేసుకోను."

కొన్ని సంవత్సరాలుగా నేను కంపెనీకి చేసిన సేవకు ఇదీ ప్రతిఫలం! నేను జైలుకు వెళ్తానని తెలుసు. నా గూర్చిన విచారం నాకు లేదు. భార్యాబిడ్డల గతి ఏం కాను? జైలు నుంచి విడదలయ్యాకన్నా నేను వాళ్ళ నెలా పోషించుకునేది? నా జీవితానికి ఇది చివరి రోజేమో?

నా ముఖకళను చూసిన మేనేజర్‌కు జాలి కలిగినట్టుంది.

రహస్యంగా అన్నాడు: "వారంరోజుల టైం ఇస్తున్నాను, యీ సంగతి నాకు తెలియనట్టుగానే ఊరుకుంటాను. యీ వారం రోజుల్లోగా నీ అవస్థ నువ్వుపడి డబ్బు కట్టావంటే నీ ఉద్యోగానిక్కూడా ముప్పు రాకుండా కాపాడుగలుగుతాను. ఇంతకన్న నేను నీకు చేయగలిగిన సహాయం లేదు."

నే నింకేమీ కోరకుండానే బైటపడ్డాను. నా శక్తి అంతా నా నుంచి పోయింది. వారం రోజులు కాదు. ఏడు సంవత్సరాల వ్యవధి ఇచ్చినా యీ మొత్తాన్ని నేను కట్టలేను. ఏం చెయ్యను?

నిమిషాలు గడుస్తూన్న కొద్దీ నా ఆతృత పెరగవలసింది. కాని నాకు ఆతృత అనేదిలేదు. యీనాడు ఏ సంఘటన నైతే ఎదుర్కొనేవాణ్నో - వారం గడిచాక కూడా అదే సంఘటనను ఎదుర్కొంటాను. అందులో మార్పేమీ ఉండదు కనుక ఆతృతను కల్పించుకోవటం అనవసరం.

భార్యాబిడ్డల్ని పుట్టింటికి పంపాను. ఒంటరిగా ఇంటివాసాల్ని లెక్కిస్తూ ముందు జరగబొయ్యే సంఘటనల్ని తలుచుకుంటూ ఉండి పొయ్యాను.

గడువు ఐపోవొచ్చింది. గంటలమీద నేను జైలుకు వెళ్ళే సమయం సమీపించింది. చివరి భోజనాన్ని చేసి - ఆఫీసుకు బయలుదేర దామనుకుంటున్నాను-

పోస్టుమాన్ కేకవిని అదిరిపడ్డాను. నన్ను కాదనుకున్నానుకాని ఒకటికి నాలుగు కేకలు విన్నాక తలుపు తీసాను.

నా పేర వున్న ఇన్స్యూర్డుకవరు చేతికి ఇచ్చాడు. వాణికే చేతుల్తో రసీదు దస్కత్ చేసిఇచ్చాను. కవరు విప్పాను. ఐదువేలరూపాయిలకూ కరెన్సీ నోట్లు ఉన్నవి. విశ్వం దస్తూరితో ఒక లేఖకూడా వుంది.

"ప్రియమిత్రమా!

ఒక విధంగా నీ పట్ల తీరని ద్రోహం చేశాను. నిన్నూ నీ జీవితాన్ని నాశనం చేసే ప్రయత్నం చేశాను. నా ప్రాణ గండానికి నీ ప్రాణాన్ని అడ్డం వేసుకున్నాను. నా పనిని యీశ్వరుడే క్షమించలే డనుకుంటాను. స్వార్థంకోసం ప్రాణమిత్రుడి ప్రాణానికే ఎసరు పెట్టిన నన్ను -

నా కొడుకు విషయంలో నీకు చెప్పిన 'ఇంటి దొంగతనం' అంతా అబద్ధం. నేను చేయదలుచుకున్న పనికి నీకేమీ అనుమానం కలగకుండా ఉండేందుకు వాడిపాత్రను ఆ విధంగా సృష్టించవలసి వొచ్చింది.

ఆ మరునాడు మూడువేల రూపాయిలు కోర్టులో కట్టవలసి వుంది. సమయానికి పైకం అందే సూచనలేమీ కనిపించలేదు. నా పరువు మర్యాదలన్నీ మంట గలిసే పరిస్థితి దాపరించింది. నేను జైలు క్కూడా పోవాల్సి వొచ్చేది. ఆ సంఘటనను తప్పించుకునేందుకు నీ పర్సును దొంగిలించవలసి వొచ్చింది. పర్స్ పెద్దదిగా కనిపించటంవల్ల నేనే ఆ పని చేద్దా మనుకున్నాను.

నేను నీకు కనిపించినంత భాగ్యవంతుణ్ని కాదు. చాలా భాగం డాబుసరితో వ్యాపారాన్ని నెట్టుతున్నాను. అందుకనే ప్రాణగండాల్లో ఇరుక్కోవటం తటస్థిస్తూ వుంటుంది.

సరి పడే పైకమే తీసుకుందామనే ఆలోచన పోయింది కాని, అది మరీ అనుమానానికి కారణ మౌతుందని యీ పనిచేశాను. నీకు కలిగించిన కష్టానికి నన్ను క్షమించలేక పోయినా, నీకు చేసిన తీరని అపచారానికి జీవితమంతా ఖేదిస్తూనే ఉంటాను. నీ -విశ్వం."

ఉత్తరం చదివాక నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు. ఇంకో గంట గడిస్తే నా శవంతోపాటే యీ నోట్లు కూడా దహన మయ్యేవి!

– జనవరి, *1948*